namasthetelangaana.com
నమస్తే తెలంగాణ
మన పత్రిక మన ఆత్మ గౌరవం
BETA

**SUNDAY, August 23, 2015**

# ఘనంగా ట్రిపుల్ ఐటీ స్నాతకోత్సవం



పట్టాలు పొందిన ఆనందంలో విద్యార్థినుల కేరింతలు

**గచ్చిబౌలి, ఆగస్టు 22:** సరస్వతీ వందనం... భగవద్గీత శ్లోకాల పఠనం... సాంప్రదాయ దుస్తులైన చీర, సల్వార్ కమీజ్, పంచ, కుర్తా, పైజామాల వేషధారణ... భుజంపై కండువాలతో భారతీయ సంస్కృతి ఉట్టిపడే దృశ్యాలకు గచ్చిబౌలి గ్లోబల్ పీస్ ఆడిటోరియం వేదికైంది. ట్రిపుల్ ఐటీ 14వ స్నాతకోత్సవాన్ని శనివారం గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ప్రొఫెసర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కళకళలాడింది స్నాతకోత్సవ ప్రాంగణం. ఓ వైపు పట్టాలు పొందిన ఉత్సాహంలో విద్యార్థుల కేరింతలు... మరో వైపు కల సాకారమైన వేళ ఆత్మీయుల ఆలింగనాలు, ఉద్వేగపూరిత క్షణాలు వెల్లి విరిశాయి.

స్నాతకోత్సవంలో విద్యార్థులు, ప్రొఫెసర్లు అచ్చమైన భారతీయతతో చీర, కుర్తా, పైజామాలతో వచ్చి ఆకట్టుకున్నారు. సరస్వతీ వందనంతో స్నాతకోత్సవాన్ని ప్రారంభించి, గీతలో ఉపదేశంతో ప్రతిజ్ఞ చేసి మన సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పారు. ఈ సందర్భంగా విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్‌ను అందజేశారు. 2015 సంవత్సరానికి ట్రిపుల్ ఐటీ గోల్డ్ మెడల్‌ను బీటెక్ ఈసీఈ విద్యార్థి మను విశ్వనాథన్ అందుకున్నాడు. ప్రోగ్రాం గోల్డ్ మెడల్స్‌ను బీటెక్ సీఎస్ఈ విద్యార్థి మయాంక్ గుప్తా, ఈసీఈ విద్యార్థి మను విశ్వనాథన్, డ్యుయల్ డిగ్రీ సీఎస్‌సీ విద్యార్థి రాఘవ్, ఎంటెక్ సీఎస్‌సీ విద్యార్థి సింధుష, వీఎల్ఎస్ఐ అండ్ సీఈ విద్యార్థి జయదేవ్ దేవగిరి, ఎంటెక్ విద్యార్థి శ్రీనివాస్ వంశీ అందుకున్నారు. వీరితోపాటు 2015 సంవత్సరానికి గాను మొత్తం 421 మందికి పట్టాలను అందజేశారు.

డిజిటల్ ఇండియా విప్లవం...

అట్టహాసంగా జరిగిన ఈ స్నాతకోత్సవానికి నీతి ఆయోగ్ సభ్యుడు విజయ్ కుమార్ సారస్వత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ పరిశోధకులు టెక్నాలజీని సమాజానికి మరింత దగ్గర చేయాలని సూచించారు. మారుమూల ప్రాంతాలకు సైతం డిజిటల్ ఇండియా ఫలితాలను తీసుకువెళ్లేందుకు 2.50 లక్షల గ్రామాలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామాల్లోని ప్రజలకు దీన్ని చేరువ చేసేందుకు ప్రాంతీయ భాషల్లో రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ పీజే నారాయణన్, అకాడమిక్ డీన్ జయంతి శివగామి తదితరులు పాల్గొన్నారు.

### మధురానుభూతి



ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ బీటెక్ పూర్తి చేశాను. అన్ని రంగాల్లో రాణించి ట్రిపుల్ ఐటీ గోల్డ్ మెడలిస్టు 2015గా నిలవడం ఎంతో అనందంగా ఉంది. జీవితంలో మరిచిపోలేని రోజు. ట్రిపుల్ ఐటీలో ప్రొఫెసర్ల నుంచి విద్యార్థులకు ఎనలేని ప్రోత్సాహం లభిస్తోంది. ఇది వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో దోహదపడుతుంది.

– మణు విశ్వనాథ్, కేరళ, ట్రిపుల్ ఐటీ గోల్డ్ మెడలిస్ట్.



విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న నీతి ఆయోగ్ సభ్యుడు విజయ్ కుమార్ సారస్వత్

### అందరి ప్రోత్సాహం మరువలేనిది



కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్‌లో బంగారు పతకం సాధించడం గొప్పగా ఉంది. ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్లతోపాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది. ఎలాంటి రంగాల్లోనైనా ఒత్తిడిని అధిగమించే ఉత్తమ శిక్షణ ఇక్కడ విద్యార్థులకు అందుతుంది. అందరి ప్రోత్సాహమే ఈ స్థాయికి చేర్చింది. పీహెచ్‌డీ పూర్తి చేయాలనుంది.

– వై.సింధుషా, ఎంటెక్ గోల్డ్ మెడలిస్ట్.

### కన్‌స్ట్రక్షన్ కంపెనీ పెట్టాలనుంది



కంప్యూటర్ ఎయిడెడ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ గోల్డ్‌మెడల్ సాధించడం సంతోషంగా ఉంది. ట్రిపుల్ ఐటీ దేశంలోనే ఉత్తమమైంది. దీనికి మరేదీ సాటి రాదు. తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది. భవిష్యత్తులో కన్‌స్ట్రక్షన్ కంపెనీ పెట్టాలనేది నా కోరిక.

– సీహెచ్ శ్రీనివాస్ వంశీ, హైదరాబాద్, ఎంటెక్ గోల్డ్ మెడలిస్ట్